# మన(సు)లో మాట

సంఘమిత్ర కార్యవర్గం పాఠకులకు అందరికీ సర్వధారి (నూతన తెలుగు) సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తోంది. ముఖచిత్రము, ముఖచిత్రం గురించి మూడు ముక్కలు బాగుందని చాలా మంది తెలియజేయడం ఆనందదాయకం. మీరు ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ, నచ్చిన ప్రదేశాలలో ఛాయాగ్రహణం చేస్తూ ఉంటారు కదా! మీ కెమెరాలో బంధించిన మంచి చిత్రములను ముఖచిత్రముగా వెలువరించే నిమిత్తము మాకు పంపవచ్చు. ఈ విధముగా మీరు మాకు సహకరించవచ్చు. మరికొన్ని చేతులు కలిస్తే పని సుళువు అవుతుందనేది మీకు తెలియనిది కాదు. మీరు ఈ విషయములో చేయూతనివ్వదలిస్తే, దయచేసి susri@sanghamitra.org కి ఈ-మెయిలు పంపించండి.

నా స్మృతి పథంలో ఒక రోజు, కొసరు, మాధురి శ్రీవారు, ముత్యాల సరములు, దీపం వెలిగించడమెందుకు, భక్త రామదాసు (కంచర్ల గోపన్న) మొదలైన శీర్షికలు చాలా బాగున్నాయని చాలామంది వ్యక్తీకరించి తెలియజేసిన అభిమానమునకు ధన్యులము. ఈ నూతన తెలుగు సంవత్సరములో మీ ఆకాంక్షలు సఫలీకృతం కావాలని కోరుకుంటూ, ఈ సర్వధారి సంవత్సరములో అన్నిటా పురోగతి సాధించాలని మనసారా శుభాకాంక్షలను తెలియజేస్తున్నాము. ఈ సంవత్సరము సంఘమిత్ర సేవాకార్యక్రమములపై దృష్టి నిలపి మరికొన్ని క్రొత్త పథకములను రూపొందించింది. వాటిలో ముఖ్యముగా మేము చేబడుతున్న వేదగణితము తరగతులను సెయింట్ లూయిస్‌కి మాత్రమే పరిమితము కాకుండా పలు ప్రదేశములలో, పలు సంస్థల తరుపున నిర్వహించే ప్రయత్నము చేస్తున్నాము; సంఘమిత్ర డిశంబరు - జనవరి మాసములలో విశాఖపట్నంలో కొన్ని కుటుంబములకు దుప్పట్లను, కొన్ని కుటుంబములకు అవసరములకు సరిపడు బట్టలను, కొందరు విద్యార్థులకు పుస్తకములు అందజేసినది. మీరూ ఈ కార్యక్రమములో పాలుపంచుకోదలిస్తే, సంఘమిత్ర కార్యవర్గాన్ని ఫోను ద్వారాగాని, ఈ-మెయిలు ద్వారా గాని సంప్రదించగలరు.

సంఘమిత్రలో ప్రచురించబడిన మాఘపు వాసంతిగారి 'ఆంధ్రకేసరి' వ్యాసము, న్యూజెర్సీ నుండి వెలువడుతున్న 'తెలుగుజ్యోతి' పత్రికలో ప్రచురించబడినదని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. రచయిత్రికి అభినందనలు. మీ ఆదరాభిమానములకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, మరొక్కసారి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. మళ్ళీ జులై సంచికలో కలుద్దామా! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.